సాక్షి
మెదక్
సోమవారం ; 27 ; మార్చి ; 2023



ఆసరా లేక అవ్వకు అవస్థలు

భర్త, నలుగురు పిల్లలు.. 12 ఎకరాల భూమితో దర్జాగా గడిపిన మహిళ వృద్ధాప్యంలో అనాథగా మారింది. సర్కారు పింఛన్‌తో జీవనం సాగిస్తోంది.

8లో



రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం


కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య ఆరోపించారు.

8లో

ముగ్గురికి కరోనా



మెదక్‌జోన్‌: జిల్లావ్యాప్తంగా ఆదివారం 36 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు జిల్లా వైద్యాధికారి చందూనాయక్‌ తెలిపారు. మెదక్‌, కొడిపల్లి, కొల్చారంలో ఒక్కో కరోనా కేసు నమోదైనట్లు చెప్పారు. ప్రజలు మాస్కులు ధరించాలని సూచించారు.



న్యూస్‌రీల్‌

ఎస్సీ వర్గీకరణకు కేంద్రమే అడ్డు



మాట్లాడుతున్న గోవిందు నరేశ్‌ మాదిగ

రామాయంపేట(మెదక్‌): ఎస్సీ వర్గీకరణను బీజేపీ ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌ మాదిగ అన్నారు. మాదిగల సంగ్రామ యాత్ర ఆదివారం జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి వచ్చే ఎన్నికల్లో మాదిగలు ఓటు వేయరని చెప్పారు. మరో పోరాటానికి మాదిగలను సిద్ధం చేయడానికే ఈయాత్ర చేపట్టామని పేర్కొన్నారు. గతంలో తమ ఆందోళనకు మద్దతు ఇచ్చిన బీజేపీ ఇప్పుడు ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని వాపోయారు. యాత్ర ఏప్రిల్‌ 4న ముగుస్తుందని.. అదే రోజు లక్షలాది మందితో హైదరాబాద్‌ను ముట్టడిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పాతూరి రాజు, మురళి, జిల్లా అధ్యక్షుడు మల్యాల కిషన్‌, మిద్దె శాంతి కుమార్‌, స్వామి, రత్నం, మల్లేశ్‌ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు కరువు భత్యం చెల్లించాలి



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న సత్యం

రామాయంపేట(మెదక్‌): రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికులకు కరువుభత్యం చెల్లించాలని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్‌ చేశారు. ఆదివారం ఆయన మండలంలోని కోనాపూర్‌లో బీడీ కార్ఖానాలను సందర్శించి కార్మికులతో మాట్లాడారు. పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్‌ ఒకటి నుంచి వర్తింపచేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. నెలలో కనీసం 25 రోజులు బీడీ కార్మికులకు పని కల్పించాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఏఈఓ రాజశేఖర్‌ గౌడ్‌




కౌడిపల్లి(నర్సాపూర్‌): కౌడిపల్లి ఏఈఓ రాజశేఖర్‌గౌడ్‌ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా ఆదివారం పూణే వెళ్లాడు. ఇటీవల ఉద్యోగులకు నిర్వహించిన ఆల్‌ ఇండియా సివిల్‌ సర్వీసెస్‌ పోటీల్లో 200, 400 మీటర్ల రన్నింగ్‌లో ఏఈఓ మొదటి స్థానంలో నిలిచారు. ఈనెల 27 నుంచి పూణేలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొననున్నారు. ఏఈఓను ఏడీఏ పద్మ, ఆత్మ కమిటీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి, ఏఓ స్వప్న, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు సార రామాగౌడ్‌, తదితరులు అభినందించారు.

రెవెన్యూ డివిజన్‌ సాధనకు నేటి నుంచి దీక్షలు

రామాయంపేట(మెదక్‌): రెవెన్యూ డివిజన్‌ సాధన కోసం సోమవారం నుంచి రామాయంపేటలో మళ్లీ నిరాహార దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఆదివారం సమావేశమైన అఖిలపక్షం ప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఏడు నెలల పాటు దీక్ష చేపట్టి అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇటీవల రామాయంపేటలో డివిజన్‌ సాధన కోసం ర్యాలీ, పట్టణ బంద్‌ నిర్వహించారు. కాగా ఈ దీక్షలకు పరోక్షంగా బీఆర్‌ఎస్‌ నాయకులు సహకారం అందజేస్తున్నట్లు సమాచారం. వ్యాపారవర్గాలు, కుల సంఘాలు, ఇతర పార్టీల వారు సైతం మద్దతు పలుకుతున్నారు.

మూడు ముక్కలాట

మెదక్‌ బీఆర్‌ఎస్‌లో వేడెక్కిన రాజకీయం ● వర్గాల వారీగా విందు.. ఆత్మీయ సమ్మేళనాలు



మెదక్‌జోన్‌: మెదక్‌ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ మూడు ముక్కలాటగా మారింది. ఇప్పటి వరకు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వర్గాలు ఉండగా.. తాజాగా మైనంపల్లి రోహిత్‌ ఎంట్రీతో మూడో వర్గం తయారైంది. వర్గాలవారీగా విందు.. ఆత్మీయ సమ్మేళనాలు జోరుగా సాగుతున్నాయి. సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యకర్తలు ఎటువైపు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నారు. ఎవరికి వారే టికెట్‌ నాకే దక్కుతుందని చెబుతుండడంతో తలలు పట్టుకుంటున్నారు.

ఇప్పటివరకు అన్నీ తానై

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018లో రెండుసార్లు పద్మాదేవేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో డిప్యూటీ స్పీకర్‌గా ఐదేళ్ల పాటు పనిచేశారు. అప్పట్లో నియోజకవర్గంలో తాను చెప్పిందే వేదంగా సాగింది. అభివృద్ధి పనులకు సంబంధించి అధిష్టానం నుంచి నేరుగా నిధులు మంజూరు చేయించేవారు. సీఎం రిలీఫ్‌ ఫండ్‌తో పాటు ఎల్‌ఓసీలు త్వరగా అందేలా కృషి చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులకు అందుబాటులో ఉంటూ అంతా తానై వ్యవహరించారు. పార్టీలో ఆమెకు ప్రత్యామ్నయమే ఉండేది కాదు. రెండోసారి 2018లో గెలుపొందిన తర్వాత అధిష్టానం ఎలాంటి పదవి ఇవ్వలేదు. కాగా ఇటీవల ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సైతం మండలాల వారీగా ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ అందుబాటులో ఉంటానని భరోసా ఇస్తున్నారు.

పట్టు పెంచుకుంటున్న ఎమ్మెల్సీ

మెదక్‌ నియోజకవర్గానికి చెందిన శేరి సుభాష్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక ఇక్కడి రాజకీయ పరిస్థితులు మారాయి. 2020 నుంచి ఆయన నియోజకవర్గంపై ప్రత్యేక ఫోకస్‌ పెట్టారు. కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటూ పట్టు పెంచుకుంటున్నారు. దీంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గాలుగా విడిపోయారు. పార్టీ అధికారిక కార్యకలాపాల్లో ఈ ఇద్దరూ పాల్గొంటున్నప్పటికీ ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. పలువురు అభివృద్ధి, పదవుల విషయంలో తమకు ప్రాధాన్యం దక్కడం లేదని ఎమ్మెల్సీ చెంతకు చేరగా.. మరికొందరు ఎమ్మెల్యే వర్గంలోనే ఉంటూ పరోక్షంగా ఎమ్మెల్సీకి మద్దతు పలుకుతున్నారు.

మైనంపల్లి ఎంట్రీతో మారిన సీన్‌

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రెండు పర్యాయాలు ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈఏడాది ఫిబ్రవరి 19న తన కుమారుడు డాక్టర్‌ రోహిత్‌తో కలిసి ఏడుపాయలకు భారీ కాన్వాయ్‌తో తరలివచ్చారు. అమ్మవారి సమక్షంలోనే రాజకీయాల్లోకి నా కుమారుడు వస్తున్నాడని ప్రకటించాడు. అందులో భాగంగా రోహిత్‌ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. అనాథ పిల్లలను దత్తత తీసుకుని ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున బ్యాంకుల్లో ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌ చేసి ఎఫ్‌డీలు అందించారు. అలాగే మెదక్‌ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని సుమారు రూ. 50 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించారు. కలెక్టర్‌కు తెలియకుండా ఎలా మరమ్మతులు చేపడుతారని డీఈఓ, పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఎంఈఓకు షోకాజ్‌ నోటీస్‌లు జారీ చేశారు. నోటీస్‌ల వెనకాల రాజకీయ కుట్ర దాగి ఉందని మైనంపల్లి వర్గీయులు చర్చించుకుంటున్నారు. రోహిత్‌ విదేశాల్లో ఉన్నాడని ఆయన వచ్చాక ఈ విషయంపై మాట్లాడుతారని చెబుతున్నారు.

కార్యకర్తల అయోమయం

మెదక్‌ బీఆర్‌ఎస్‌లో మూడు వర్గాలు తయారు కావడంతో కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు ఎటువైపు వెళ్లాలో తేల్చుకోలేక సతమతమవుతున్నారు. గత నెలలో చేగుంట మండలం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట మండలాలకు చెందిన బీఆర్‌ఎస్‌ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు సుమారు 100 మందికిపైగా సమావేశమైయ్యారు. ఈ విందులో మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వర్గాలకు చెందిన వారు ఉన్నట్టు సమాచారం. విందు వెనకాల ఎవరున్నారు..? ఎందుకు ఏర్పాటు చేశారని పెద్ద దుమారమే చెలరేగింది. నిజాంపేట మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ముఖ్య నాయకులకు ఫోన్లు చేసి విందుకు ఆహ్వానించినట్టు సమాచారం.

‘ఆరోగ్య మహిళ’కు మంచి స్పందన

కలెక్టర్‌ రాజర్షిషా



మెదక్‌ కలెక్టరేట్‌: మహిళలను సంపూర్ణ ఆరోగ్య వంతులుగా చేయడమే లక్ష్యంగా ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లాలో ఈ కేంద్రాలకు చక్కటి స్పందన ఉందని కలెక్టర్‌ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గంలోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కేంద్రాలను నెలకొల్పినట్టు పేర్కొన్నారు. ఇందులో 953 మంది మహిళలకు వైద్య నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. మెరుగైన వైద్యం, అవసరమైన వారికి చికిత్స కోసం 38 మందిని జిల్లా ఆస్పత్రికి, మరో 8 మందిని హైదరాబాద్‌కు రెఫర్‌ చేసినట్టు వివరించారు. వైద్య పరీక్షల నిర్వహణలో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో ఉందన్నారు. క్లినిక్‌కు వచ్చే మహిళల వివరాలను ప్రత్యేక యాప్‌లో పకడ్బందీగా నమోదు చేస్తున్నామని తెలిపారు.

2,57,613 మందికి కంటి పరీక్షలు

జిల్లాలో శుక్రవారం వరకు 2,57,613 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని కలెక్టర్‌ రాజర్షిషా తెలిపారు. ఇందులో 1,20,673 మంది పురుషులు, 1,36,877 మంది మహిళలు, 22 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. 469 గ్రామ పంచాయతీలు, 75 మున్సిపల్‌ వార్డులకు గానూ ఇంతవరకు 259 గ్రామ పంచాయతీలు, 45 మున్సిపల్‌ వార్డుల్లో కంటి పరీక్షలు పూర్తి చేశామని వివరించారు. ఇప్పటివరకు 30,172 మందికి రీడింగ్‌ అద్దాలు పంపిణీ చేశామన్నారు. కాగా 1,97,447 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేని వారిగా గుర్తించినట్లు చెప్పారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు పుణ్యస్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. గంగిరేణి చెట్టు వద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్తంభం వద్ద కోడెను కట్టి స్వామి మా వారిని వేడుకున్నారు,. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శిచుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. చైర్మన్‌ గీస భిక్షపతి, ఈఓ బాలాజీ, ఏఈఓ అంజయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు హుండీ లెక్కింపు

స్వామి వారి హుండీని నేడు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ బాలాజీ తెలిపారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పోలీస్‌, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపడతామన్నారు.



గంగిరేణి చెట్టు ప్రాంగణంలో భక్తుల రద్దీ

మార్పు మనతోనే మొదలవ్వాలి

మానవ హక్కుల కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ చంద్రయ్య



మాట్లాడుతున్న జస్టిస్‌ చంద్రయ్య

కొండాపూర్‌(సంగారెడ్డి): సమాజంలో మహిళలపై అణచివేత, వివక్షత ఎక్కువైందని, సమాజ మార్పు మనతోనే మొదలవ్వాలని మానవ హక్కుల కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ చంద్రయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తెలంగాణ గిరిజన గురుకుల న్యాయ కళాశాలలో న్యాయ విద్యార్థులకు మహిళలపై నేరాలు, నేర న్యాయ వ్యవస్థ - సవాళ్లు, పరిష్కార మార్గాలు అనే అంశంపై సెమినార్‌ నిర్వహించారు. ఈ సెమినార్‌కు హాజరైన చంద్రయ్య మాట్లాడుతూ ప్రాథమిక హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రతి పౌరుడికి హక్కులు ఉంటాయని, నేటి సమాజంలో స్త్రీని ద్వితీయ శ్రేణి పౌరురాలిగా చూడడం బాధాకరమన్నారు. దేశంలో 140 కోట్లకు మించిన జనాభాలో సగ భాగం మహిళలే అయినప్పటికీ చట్టసభల్లో కేవలం 12 శాతం మాత్రమే ఉన్నారన్నారు. ఎవరూ రాజ్యాంగాన్ని చదివినా, చదవకపోయినా, న్యాయ విద్యార్థులు మాత్రం తప్పనిసరిగా చదవాలన్నారు. అనంతరం జిల్లా సెషన్స్‌ జడ్జి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబం స్థాయి నుంచే స్త్రీ వివక్షతకు గురవుతుందన్నారు. మహిళలకు రక్షణ, న్యాయ సహాయం అందించడంలో భాగంగా జిల్లా కేంద్రాల్లో భరోసా, సఖి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సెమినార్‌లో ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ శాఖ డీన్‌ ప్రొఫెసర్‌ గాలి వినోద్‌కుమార్‌, గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ డిప్యూటీ డైరెక్టర్‌ జగదీష్‌ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్‌ కృష్ణనాయక్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ రూత్‌ కమిలిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే కుట్ర



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

నర్సాపూర్‌: విచారణ సంస్థలతో ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేలా బీజేపీ కుట్ర పన్నుతుందని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్‌ ఆంజనేయులుగౌడ్‌ ఆరోపించారు. ఆదివారం నర్సాపూర్‌ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీబీఐ, ఈడీ తదితర విచారణ సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌ సభ్యత్వం రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. బీజేపీ నాయకులు ప్రజల మధ్య మతాల చిచ్చు పెట్టి ప్రజలను విడగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, రిజ్వాన్‌, మల్లేష్‌, శ్రీనివాస్‌గుప్తా, అశోక్‌గౌడ్‌, సుదర్శన్‌గౌడ్‌, చిన్న అంజిగౌడ్‌, పాష, శ్రీనివాస్‌రెడ్డి, అజ్మత్‌ఖాన్‌, ఉదయ్‌కుమార్‌, శ్రీశైలంయాదవ్‌, రషీద్‌, తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వే గేట్‌

రామాయంపేట(మెదక్‌): మండలంలోని అక్కన్నపేట రైల్వే గేట్‌ మొరాయించగా.. అరగంటకు పైగా ట్రాఫిక్‌ నిలిచిపోయింది. ఉదయం నాందేడ్‌ వెళ్తున్న ఇంటర్‌సిటి కోసం గేట్‌ వేశారు. రైలు వెళ్లిపోయిన తర్వాత గేట్‌ ఓపెన్‌ కాలేదు. రైల్వే సిబ్బంది ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో రామాయంపేట, మెదక్‌ రూట్‌లో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. స్థానికుల సహకారంతో అతి కష్టం మీద గేట్‌ తెరిచారు. అరగంటకు పైగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.



అక్కన్నపేట రైల్వే గేట్‌ వద్ద ట్రాఫిక్‌ జాం

ప్రధాని మోదీని గద్దె దించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కరాములు

సదాశివపేట(సంగారెడ్డి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ మతోన్మాద కార్పొరేట్‌ విధానాలను వ్యతిరేకించాలని, ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కారాములు పిలుపునిచ్చారు. సీపీఎం నిర్వహిస్తున్న జన చైతన్యయాత్ర ఆదివారం సదాశివపేట పట్టణానికి చేరుకున్న సందర్భంగా బస్టాండ్‌ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంటే అదాని, అంబాని సొత్తుగా మార్చేశారని, గ్యాస్‌, పెట్రోల్‌, డీజిల్‌, నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాగర్‌, రమణ, జిల్లా కార్యదర్శి జయరాజ్‌, నాయకులు రాజయ్య, సాయిలు, మల్లేశం, రామచందర్‌, రమేశ్‌గౌడ్‌, మల్లేశం, ఎండీ ఖయ్యూం, అశ్వక్‌, శ్రీనివాస్‌, యాదవరెడ్డి, ఏశోబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్క రాములు

జనసంద్రంగా ఏడుపాయల



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల ఆదివారం జనసంద్రంగా మారింది. తెల్లవారుజామునే పూజారులు అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీర పాయల్లో స్నానాలు చేసి బారులు తీరి దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో విందు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పాలకమండలి చైర్మన్‌ బాలాగౌడ్‌, ఈఓ సార శ్రీనివాస్‌, పాలక మండలి సభ్యులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- ఆగస్టులోపు వెయ్యి పడకల ఆస్పత్రి
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్‌ కళాశాలకు అనుబంధంగా నిర్మిస్తున్న వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేసి వచ్చే ఆగస్టులోపు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి హరీశ్‌రావు అధికారులకు ఆదేశించారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో రక్త నమూనాల సేకరణ కేంద్రం, ధోబీ ఘాట్‌లను ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించి, ఆస్పత్రి ఆవరణాన్ని శుభ్రంగా ఉంచాలని శానిటేషన్‌ సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు మంచి డైట్‌ అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో వైద్య సిబ్బంది ఆప్యాయంగా మాట్లాడాలని ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్‌ కళాశాల, జనరల్‌ ఆస్పత్రి సుందరీకరణకు రూ.4.17కోట్లు మంజూరయ్యాయని, పెండింగ్‌ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

జీజీహెచ్‌కు మదర్‌ మిల్క్‌ బ్యాంకు

సిద్దిపేట ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి మదర్‌ మిల్క్‌ బ్యాంకు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. అప్పుడే జన్మించిన శిశువుకు తల్లి పాలు ఇచ్చేందుకు మిల్క్‌ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తల్లి పాలు పడక ఇబ్బంది పడే వారికి మిల్క్‌ బ్యాంక్‌ దోహదపడుతుందన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో బయోకెమిస్ట్రీ విభాగంలో మరో ఐదు సీట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో మంత్రి కాన్వాయ్‌లో ఓ వాహన డ్రైవర్‌కు అస్వస్థత తలెత్తడంతో ఆస్పత్రిలో అడ్మిట్‌ చేయించి చికిత్స అందించారు. కార్యక్రమంలో మెడికల్‌ కళాశాల డైరెక్టర్‌ విమలాథామస్‌, సూపరింటెండెంట్‌ డాక్టర్‌ కిషోర్‌కుమార్‌, డాక్టర్‌ రాంమోహన్‌, ఆర్‌ఎంఓలు డాక్టర్‌ హేమలత, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఆవరణను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, అధికారులు

క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘనస్వాగతం



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్ టౌన్: కర్ణాటక రాష్ట్రంలోని బసవ కల్యాణ్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బహిరంగ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆదివారం జహీరాబాద్ మీదుగా తరలివెళ్లారు. ఆయన వెంట బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఉన్నారు. హుగ్గెల్లి చౌరస్తాలో బండి సంజయ్, ఈటల రాజేందర్‌కు జహీరాబాద్ బీజేపీ నాయకులు సన్మానించి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ ప్రధాన కార్యదర్శి జగన్నాథం, సుధీర్ కుమార్, జనార్ద న్ రెడ్డి, రామచందర్, శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, నాయకులు పూల సంతోష్, విశ్వనాథ్ యాదవ్, విశ్వనాథ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మార్డి గ్రామానికి చెందిన గుర్రపు జలందర్ తన పశువులను పొలంలో మేపుతున్నాడు. ఈక్రమంలో కరెంట్ తీగలు తగిలి ఆవు మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ కూలి పనులు చేస్తున్నాడు. తాగుడుకు బానిసై డబ్బుల కోసం తల్లిని బెదిరిస్తుండేవాడన్నారు. శనివారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని అడిగగా ఆమె ఇవ్వలేదు. దీంతో అదేరోజు అర్ధరాత్రి ఇంటి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి ఎల్ల అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వజ్రోత్సవాలకు తరలిరావాలి

కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్



మాట్లాడుతున్న కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

హుస్నాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థాపించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించుకునే వజ్రోత్సవాలకు పదో తరగతి పూర్వ విద్యార్థులు తరలిరావాలని కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్, పూర్వ విద్యార్థి గాజుల శ్యాంప్రసాద్ లాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం వజ్రోత్సవ సన్నాహ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వజ్రోత్సవ కమిటీ కన్వీనర్ కొండా లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వజ్రోత్సవ సన్నాహక కార్యక్రమాన్ని ఏ పాఠశాల నిర్వహించలేదని, మొదటి సారిగా వారం పాటు నిర్వహించే వజ్రోత్సవ సంబరాలను గొప్ప పండుగా నిర్వహించుకోవాలన్నారు.డాక్టర్లుగా, ప్రొఫెసర్లుగా, ఇంజనీర్లుగా, రాజకీయవేత్తలుగా, విద్యావంతులు, ఉన్నతమైనహోదాలో ఉన్న ప్రతీ ఒక్కరిని సన్మానించుకోవాలన్నారు. ఏప్రిల్ 23 నుంచి 30వ తేదీ వరకు వజ్రోత్సవాల సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్వాహణ కమిటీ నిర్ణయించిందన్నారు. ఏప్రిల్ 23న ప్రారంభ కార్యక్రమం పైలాన్ ఆవిష్కరించడం, 24న సాహితీ సదస్సు, సెమినార్, 25న పట్టణంలో బైక్ ర్యాలీ, 26న సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు, 27న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బతుకమ్మ ఆటపాటలు, కోలాటాలు, 28న న్యాయవాదుల సదస్సు, 5కె, 2కె రన్, 29న ముగింపు ఉత్సావాల సందర్భంగా వివిధ కమిటీలతో సమావేశం, 30న వజ్రోత్సవ ముగింపు సభ ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలను దిగ్విజయం చేసేందుకు కమిటీలకు భాద్యతలు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమ వివరాలను ప్రతీ పదో తరగతి గ్రూప్ నిర్వాహకులు ప్రతీ పూర్వ విద్యార్థికి సమాచారం తెలిపి వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని శ్యాంప్రసాద్ లాల్ సూచించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, పాఠశాల హెచ్ఎం బండారి మనీల, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు అన్నవరం దేవేందర్, రాజగోపాల్ రావు, రత్నాకర్, కొత్తపల్లి అశోక్, వెంకట రమణ, అయిత శ్రీధర్, దేవేందర్, వెంకట రమణారెడ్డి, చింతకింది శ్రీనివాస్, వరయోగుల నరేందర్, తదితరులు ఉన్నారు.

ఆసరా లేక అవ్వకు అవస్థలు

- వృద్ధాప్యంలో అనాథలా లచ్చవ్వ
- సర్కార్ పింఛన్‌తోనే జీవనం



లచ్చవ్వ ఉంటున్న రేకుల గది



ఏసిక లచ్చవ్వ

బెజ్జంకి(సిద్దిపేట): భర్త నలుగురు పిల్లలతో పాటు 12 ఎకరాల భూమితో దర్జాగా గడిపిన మహిళా ఇప్పుడు అనాథలా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జంకి శివారు పాపన్నపల్లెకు చెంది ఏసిక లచ్చవ్వ, రాజారాం దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుల్లన్నారు. వారందరికి వివాహాలు జరిగాయి. పెద్దకొడుకు కామారెడ్డి, చిన్న కుమారుడు కరీంనగర్ ప్రాంతాలలో జీవిస్తున్నారు. పదేళ్ల క్రితం భర్త మృతి చెందాడు. కనీస వసతులు లేని చిన్న రేకుల గదిలో ఉంటుంది. కొన్నేళ్లు చిన్న కుమారుడు బాగోగులు చూసేవాడు. గత మూడేళ్లుగా ఒక్కతే ఉంటుంది. తమకు అత్తగారిచ్చిన 10 ఎకరాలతో పాటు తల్లిగారికి చెందిన రెండు ఎకరాల భూమి మొత్తం 12 ఎకరాలు ఉండేది. ఆభూమితో పాటు బంగారం, వెండి తీసుకున్నారు. చిన్న కుమారుడికి ఇచ్చిన రెండెకరాల భూమి అన్నదమ్ముల మధ్య తగాదాలో పడావులో ఉంది. ఇంత చేసినా తన అలనా పాలన చూసే వారులేరని రోదిస్తోంది. సర్కార్ ఇచ్చే పింఛన్‌తోనే జీవనం సాగిస్తోంది. అయితే వృద్ధాప్యం కారణంగా పింఛన్ తెచ్చుకోవడానికి ఆరోగ్యం సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. పెన్షన్ ఇంటి వద్ద ఇచ్చే చేయాలని, అలాగే తనను కుమారులు చూసుకునేలా చూడాలని కోరుతోంది.

పచ్చని పొలాలతో కళకళలాడుతున్న పల్లెలు

- మండుటెండలో మత్తడి చూశామా..
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్ నీటితో మండుటెండలో చెరువులు మత్తడి దూకడంతో పచ్చని పొలాలతో పల్లెలు కళకళలాడుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అక్కెనపల్లి మదిర గ్రామంలోని ఆరేపల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు నీళ్లు లేక బోర్ల కోసం పుస్తెలు అమ్మి అరిగోస పడ్డ మీరు ఏటా రెండు పంటలు పండించడం సంతోషంగా ఉందన్నారు. వానా కాలంలో మత్తడి దూకని చెరువులు కేసీఆర్ పుణ్యమా అని కాళేశ్వరం నీటితో జలకళ సంతరించుకున్నాయన్నారు.

ప్రిన్సిపాల్ మృతి



ప్రబీనా

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లోని ఎంఆర్‌హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఆదివారం మృతి చెందారు. ఆమెరికాకు చెందిన గార్డెన్ దొర జహీరాబాద్‌లోని అల్లీపూర్ వద్ద మొట్ట మొదటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను స్థాపించారు. ఈ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రబీనా ఇమాన్యుయల్ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం మెథడిస్టు సెంట్రల్ చర్చిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి



జితేందర్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ భీంరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం మండలం మాదారం గ్రామానికి చెందిన కాసాల జితేందర్(28) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. 24వ తేదీ సాయంత్రం తన బైక్‌పై మాదారం నుంచి ముత్తంగి వెళ్తున్నాడు. పోచారం గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స కోసం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ భరించలేక..



మీస రాయుడు (ఫైల్)

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లికి చెందిన రైతు మీస రాయుడు (43) వ్యవసాయం చేస్తున్నాడు. సాగు కోసం అప్పులు చేశాడు. దిగుబడులు సరిగా రాక, అప్పుల భారం పెరగడంతో తాగుకు బానిసయ్యాడు. ఈక్రమంలో ఈనెల 22వ తేదీన తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లిలోఉన్న ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తోంది

- రాష్ట్ర విభజన హామీలు అమలులో విఫలం
- కార్పొరేట్ కంపెనీలకు రెడ్‌కార్పెట్
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు



దేవక్కపల్లెలో జనచైతన్య యాత్రలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ, రైతుల సంక్షేమాన్ని విస్మరించి రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్. వీరయ్య ఆరోపించాడు. సీపీఎం నిర్వహిస్తున్న రాష్ట్ర జనచైతన్య యాత్ర ఆదివారం మండలంలోని దేవక్కపల్లెకు చేరుకుంది. పార్టీ శ్రేణులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారం కోసం కుట్రలు చేస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నరని దుయ్యబట్టారు. దొరలు, జమీందార్లను తరిమికొట్టి రజాకార్లను గడగడలాడించిన వీర తెలంగాణలో వారి ఆటలు సాగవన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. బీజేపీ మతోన్మాదం, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో జనచైతన్య యాత్రలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆశాలు సైకిలాబ్ బాబు, అడివయ్య, జయలక్ష్మి, బాలకృష్ణ, జగదీష్, కళావతి, గోపాలస్వామి, శశిధర్, శారద, అరుణ్‌కుమార్, తిప్పారపు శ్రీనివాస్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: ముగ్గురికి గాయాలు



గాయపడిన యువకుడు

దుబ్బాక: రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన జితేందర్, సురేందర్ బైక్‌పై దుబ్బాక నుంచి తోర్నాలకు వెళ్తున్నారు. ఇదే క్రమంలో రావురూకులకు చెందిన నందు బైక్‌పై దుబ్బాక వస్తున్నాడు. దుబ్బాక టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో జితేందర్, నందు, సురేందర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 లో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి డాక్టర్ల సూచన మేరకు సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

కొండాపూర్(సంగారెడ్డి): ఈనెల 28వ తేదీన ఉమ్మడి మెదక్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబ్ ఖాన్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ హఠావో, దేశ్ బచావో కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈనెల 28వ తేదీన సంగారెడ్డిలోని టీఎన్‌జీఓ భవన్‌లో సీపీఐ ఉమ్మడి మెదక్ జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐబీ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఈ సదస్సుకు సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. పార్టీ శ్రేణులు, మేధావులు పాల్గొని సదస్సును జయప్రద చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రుబినా బేగం, సునీత, కౌన్సిల్ సభ్యుడు అజార్, పట్టణ నాయకులు బాబా, కృష్ణ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరో ఇద్దరు..

వాహనం ఢీకొని కార్మికుడు..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వాహనం ఢీకొని ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మద్దికుంట శివారులోగల ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ ఎదుట జరిగింది. సదాశివపేట సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలంలోని బుదేరా గ్రామానికి చెందిన బోయిని ఈశ్వరయ్య(49) ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం నైట్ షిఫ్ట్ విధులకు వెళ్లేందుకు పరిశ్రమ వద్దకు చేరుకొని రోడ్డు దాటుతుండగా సదాశివపేట నుంచి జహీరాబాద్ వెళ్తున్న డీసీఎం బలంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ ..



స్రవంతి (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్‌లో ఆదివారం జరిగింది. నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిల్లుట్ల యాద గౌడ్ కూతురు స్రవంతి (30) గ్రామంలోని ప్రధాన రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. వెంటనే ఆమెను హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. తండ్రి యాదగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పార్కింగ్ చేసిన కారు టైర్ల చోరీ



టైర్లు ఎత్తుకెళ్లిన కారు

చేగుంట(తూప్రాన్): పార్కింగ్ చేసిన కారు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మండలంలోని వడియారంలో జరిగింది. గ్రామ సర్పంచ్ తిరుమల భర్త నర్సింలు శనివారం రాత్రి తన ఇంటి సమీపంలో కారును పార్కింగ్ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు కారు టైర్లను దొంగిలించారు. ఆదివారం కారు టైర్లు కనిపించకపోవడం ఓ చోరీచేశారని గ్రహించి నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో వ్యక్తి ..



పయ్యావుల బాల్‌రాజు (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డికి చెందిన పయ్యావుల బాల్‌రాజు బార్బర్ షాప్ నిర్వహిస్తూ భార్య లక్ష్మి, 19 సంవత్సరాలలోపు ఇద్దరు పిల్లలు సౌజన్య, శివ కుమార్ పోషించుకుంటున్నాడు. ఆదివారం తెల్లవారు జామున బాల్‌రాజు తీవ్ర అస్వస్థకు గురి కావడంతో కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాల్‌రాజు గుండెపోటుకు గురయ్యాడు. డాక్టర్లు బతికించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో బాల్‌రాజు తుది శ్వాస వదిలాడు. బాల్‌రాజు మృతి పట్ల నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కోత్వాల్ యాద నరేందర్, మండల ఉపాధ్యక్షుడు రాసమల్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు పయ్యావుల లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గౌరవెల్లిలో ఇసుక లారీ అడ్డగింత



ఇసుక లారీలను అడ్డుకున్న బీజేపీ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు కట్ట నిర్మాణం కోసం ఇసుకను రవాణా చేస్తున్నారు. లారీలు గౌరవెల్లి గ్రామం మీదుగా పదుల సంఖ్యలో నిత్యం వెళ్తున్నాయి. ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు గొల్లపెల్లి వీరాచారి, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి కర్ణకంటి నరేష్, గ్రామస్తులు వాటిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదుల సంఖ్యలో ఇసుక లారీల రాకపోకలతో గ్రామంలోని రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. అంతేకాకుండా అమిత వేగంతో వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని స్థితిలో రోడ్లు ఉన్నాయన్నారు. ధ్వంసమైన రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తాండ్ర వివేక్ సంఘటనా స్థలానికి చేరుకొని రేపటిలోగా రోడ్డు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్లీనరీ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.మహేంద్రం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథం విద్యార్థుల్లో పెంపొదించడానికి రాష్ట్ర స్థాయిలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రజలు మూఢ నమ్మకాలతో నష్టపోకుండా ఉండేందుకు వారిలో చైతన్యం తీసుకురావడానికి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నటుల చెప్పారు. ఇందులో భాగంగా ' సహజపానీయాలు సేవించండి శీతల పానీయాలు మానండి' నినాదంతో వేసవిలో అవగాహన సదస్సులు నిర్వహి స్తున్నామన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఆరోగ్యకరమైన శాస్త్రీయ సమాజ నిర్మాణ కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు మహేంద్రం మాట్లాడుతూ జిల్లాలో చెకుముకి సైన్స్ సంబరాల్లో 22 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. నూతన సైన్స్ ఆవిష్కరణలు తెలుసుకోవడం కోసం 'చెకుముకి బాలల సైన్స్ మాస పత్రిక 'జన విజ్ఞాన వేదిక విద్యార్థుల కోసం ప్రచురిస్తుందన్నారు. చెకుముకి చందాదారులుగా జిల్లాలో 200 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, శాస్త్రీయ ఆలోచన పెంపొందించుటకు శిక్షణ శిబిరాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన అన్ని కార్యక్రమాలును విజయవంతం చేసేందుకు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ములుగు బాలరాజు, ప్రధాన కార్యదర్శి తుమ్మ సత్యం, జిల్లా కోశాధికారి సాదత్ అలీ, సిద్దిపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు మహేందర్, చేర్యాల మండలం బాధ్యులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

- కుటుంబ సభ్యుల ఆందోళన
- నచ్చజెప్పిన పోలీసులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు



సౌజన్య(ఫైల్)

తూప్రాన్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురుకుల విద్యార్థిని మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఈ సంఘటన ఆదివారం మున్సిపల్ పరిధి పోతరాజుపల్లిలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల వద్ద జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన మంగలి సౌజన్య (13) గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమెకు ఈ నెల 22వ తేదీన తీవ్రజ్వరం రావాడంతో హాస్టల్ వార్డెన్ మందులు ఇచ్చాడు. అయినా జ్వరం తగ్గకపోవడంతో విద్యార్థిని తల్లిదండ్రులు బలరాం, సావిత్రికి పాఠశాల ప్రిన్సిపాల్ అర్షియా తరణ్నుమ్ తెలిపారు. దీంతో వారు సంగారెడ్డిలోని సన్‌రైజ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. జ్వరం తగ్గకపోవడంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించిందని వైద్యులు చెప్పడంతో వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రిన్సిపాల్ అర్షియా తరణ్నుమ్, వార్డెన్ నిర్లక్ష్యం వల్లే తమ కూతురు మృతి చెందిందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసిన పోలీసులు పాఠశాలకు చేరుకొని ఆందోళన కారులకు నచ్చజెప్పారు. పోలీసులకు కుటుంబ సభ్యులు, బంధువులు ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపారు.